క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ప్రశాంత్ బాజీరావు పాటిల్

బహదూర్‌పురా: జూ క్యూరేటర్‌గా ప్రశాంత్ బాజీరావు పాటిల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం నెహ్రూ జూ పార్కులో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఆంగ్ల విభాగంలో–2, కంప్యూటర్‌లో 2 పోస్టులకు గాను తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ తెలిపారు. ఈనెల 27న ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

సందడిగా స్నాతకోత్సవం



విజయనగర్‌కాలనీ: విద్యార్థులు క్రమశిక్షణ, పెద్దలపట్ల గౌరవంతో మెలగాలని నిజాం కళాశాల గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రేణుకా అన్నారు. శనివారం విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పట్టాలు, మెడల్స్ అందజేసిన అనంతరం మాట్లాడారు. రవీంద్ర భారతి విద్యా సంస్థల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్, పాఠశాల ప్రిన్సిపాల్ నూరీన్ ఫాతీమా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు




చాంద్రాయణగుట్ట: చార్మినార్ ఏసీపీగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన రుద్ర భాస్కర్ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఫోర్ మెన్ కమిటీ చైర్మన్ పోసాని సురేందర్ ముదిరాజ్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కె.విష్ణుగౌడ్, నాగరాజు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ ఓటమి ఖాయం’


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిలో నిండా మునిగిందని బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద ఆయన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, రాష్ట్రంలో ఎప్పుడూ ఎన్నికలు జరిగినా కూడా బీఆర్‌ఎస్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఆయన అన్నారు. టీఎస్‌పీఎస్సీని తన చేతుల్లో పెట్టుకుని ముఖ్యమంత్రి కుటుంబం లీకేజీల ద్వారా అక్రమార్జనకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. నామా యాదగిరి, అశ్విన్, రాధాకృష్ణ యాదవ్, రక్షిత్ సాగర్ తదితరులున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



గోల్కొండ: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గోల్కొండ కోటపై కొలువుదీరిన జగదాంబిక మహంకాళి అమ్మవార్ల హుండీ ఆదాయం బాగా పెరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు అన్నారు. శనివారం కోటలోని ఆలయ ప్రాంగణంలో హుండీని లెక్కించారు. ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. సాధారణ రోజుల్లో కూడా భక్తులు హుండీలో నగదు కానుకలు సమర్పించుకుంటున్నారన్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌కుమార్, శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, శివశంకర్, పూజారి సురేష్ చారి, శివ ఆదినారాయణ ఉన్నారు. ఈ లెక్కింపు ద్వారా రూ.68,750లు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

పాతబస్తీలో ఉచిత పార్కింగ్ సౌకర్యం

- రంజాన్ మార్కెట్‌తో రద్దీగా చార్మినార్ పరిసరాలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు పార్కింగ్ సదుపాయం
- మక్కా మసీదులో ప్రార్థనలతో పాటు తరావీలకు వేలాదిగా జనం
- సమస్యలు తలెత్తకుండా అందుబాటులోకి అదనపు పార్కింగ్ సదుపాయం



చార్మినార్ పంచమొహల్లా వద్ద..



మక్కా మసీదు రోడ్డులో ఏర్పాటు చేసిన సైన్ బోర్డు

చార్మినార్: రంజాన్ మాసంలో పాతబస్తీ చార్మినార్ పరిసరాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. నగరంలోని ప్రజలే కాకుండా శివారు జిల్లాల ప్రజలు సైతం పాతబస్తీకి వచ్చి తమకు అవసరమైన నిత్యావసర వస్తువులతో పాటు సరదాగా కాలక్షేపం చేస్తారు. మరీ ముఖ్యంగా కుటుంబసభ్యులతో కలిసి చార్మినార్–మక్కా మసీదులను సందర్శిస్తుంటారు. సాధారణ రోజుల్లోనే చార్మినార్ పరిసరాలు సందర్శకులతో కిటకిటలాడుతాయి. ఇక రంజాన్ మాసంలో ఈ రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. వాహనాల ద్వారా పాతబస్తీకి చేరుకునే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. దీంతో ఇక్కడ పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. చార్మినార్ పరిసరాల్లో ఏళ్ల తరబడి ట్రాఫిక్ సమస్య ఉంది. అసలే ఇరుకు ఇరుకు రోడ్లు.. ఆపై నడిచేందుకు కూడా వీలు లేకుండా ఫుట్‌పాత్‌లు. దీనికి తోడు అక్కడక్కడ బాటిల్ నెక్ రోడ్లు. ఇతర ప్రాంతాల నుంచి పాతబస్తీకి వచ్చే వారికి ఇక్కడ పార్కింగ్ సమస్య అధికంగా ఉంటుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు.

చార్మినార్ అవుటర్ అండ్ ఇన్నర్ రింగ్ రోడ్డులో..

చార్మినార్ అవుటర్ రింగ్ రోడ్డుతో పాటు ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఖాళీ స్థలాలను ఎంపిక చేసి ఉచిత పార్కింగ్‌కు కేటాయించారు. దీంతో ప్రస్తుతం నెల రోజుల పాటు వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి అసౌకర్యాలు ఉండవు. ఉచితంగా పార్కింగ్ సౌకర్యం అంటూ ప్రధాన రోడ్డుపై సైన్ బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. ఆయా పార్కింగ్ స్థలాలను వాహనదారులకు చూపించడం కోసం ట్రాఫిక్ పోలీసులు విధినిర్వహణలో కొనసాగుతున్నారు. ఎక్కడ ఏవైనా ట్రాఫిక్ సమస్యలతో పాటు పార్కింగ్ సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించేటట్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో కొంత మంది యువకులు అక్రమంగా పార్కింగ్ పేరుతో డబ్బులు వసూలు చేసిన సంఘటనలుండడంతో ఈసారి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా ఎవరైనా అక్రమ పార్కింగ్ వసూళ్లకు పాల్పడితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

ఉచిత పార్కింగ్ ప్రదేశాలు ఇవే..

- చార్మినార్‌లోని యునానీ ఆయుర్వేద ఆస్పత్రి ప్రాంగణం
- చౌక్ మైదాన్‌ఖాన్‌లోని ముఫీదుల్లానాం బాయిస్ హైస్కూల్
- చార్మినార్ సర్దార్ మహల్ భవన ప్రాంగణం..
- మోతీగల్లీలోని పాత పెన్షన్ కార్యాలయం..
- ఖిల్వత్ గ్రౌండ్
- ఉర్దూ మస్కాన్ ఆడిటోరియం భవన ప్రాంగణం
- ఎస్.వై.జే. కాంప్లెక్స్
- కుడా స్టేడియం
- చార్మినార్ పంచమొహల్లా పాత ఆర్టీసీ బస్టాండ్
- బహదూర్‌పురా పీఎస్ పరిధిలోని జూలూ ఖానా

రంజాన్ మాసంలో సమస్యలు రాకుండా చర్యలు


బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: రంజాన్ నేపథ్యంలో స్థానిక బస్తీల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని యాకుత్‌పురా, రైల్వేస్టేషన్, ఎస్‌ఆర్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇటీవల బస్తీల్లో డ్రైనేజ్ మ్యాన్‌హోల్ నుంచి తొలగించి రోడ్లపై వేసిన వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ప్రారంభం కావడంతో స్థానిక మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను సైతం రంజాన్ పండగలోపు పూర్తి చేయిస్తామన్నారు. మసీదుల వద్ద ప్రతిరోజూ ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలకు సమస్యలు రాకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పారిశుద్ధ్య వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయనతో పాటు మజ్లిస్ పార్టీ నాయకులు సజీద్, అజీం, జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

‘రాహుల్ పార్లమెంటు సభ్యత్వం రద్దు మోదీ రాజకీయ కుట్ర’

గౌలిపురా: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, ఎంపీ, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం మోదీ బీజేపీ నియంతృత్వ పాలనకు నిదర్శమని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలు ఇచ్చిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ నాయకత్వంలో పోరాడిన కాంగ్రెస్ పార్టీ, దేశంలో బీజేపీ వ్యతిరేక పాలనపై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటాన్ని తట్టుకోలేక ఇలాంటి కుట్రకు బీజేపీ తెర లేపిందన్నారు.

‘పది’ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన


పరీక్షా ప్యాడ్‌లను అందజేస్తున్న డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే, సునేత్ర నర్సింగ్‌రావు

జియాగూడ: విద్యార్థులు సమయస్ఫూర్తితో పరీక్షలకు హాజరై మంచి మార్కులు సాధించాలని జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవగాహన, ఉచితంగా పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అనంతరం బాల్‌రాజ్ కౌలే మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎంతో నేర్పుతో తమకు ఇచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని పూర్తిగా పరీక్షలు రాయాలని సూచించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు పరీక్షల్లో విజయ ఢంకా మోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునేత్ర కౌలే, టీచర్లు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు


ఊరేగింపులో రాజువస్తాద్ తదితరులు

లంగర్‌హౌస్: శ్రీకృష్ణుని నామస్మరణతో లంగర్‌హౌస్ ప్రాంతం మార్మోగింది. వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా త్రివేణి సంగం చారిత్రాత్మక మఠదేవాలయం జానకీసమేత వీరవెంకట విజయరాఘవస్వామి ఆలయంలో స్వామి వారు పరమాత్మ శ్రీకృష్ణుని రూపంలో దర్శన మిచ్చారు. వేదపండితులతో స్వామి వారిని లంగర్‌హౌస్ పుర వీధుల్లో ఊరేగించారు. పీఠాధిపతి 1008 రాహుల్ దాస్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఊరేగింపులో ప్రముఖ సంఘసేవకులు రాజువస్తాద్, లింగారెడ్డి, వినోద్ అగర్వాల్, ఇంద్రసేనారెడ్డి, వినేష్‌సింగ్, వసంత్‌రెడ్డి, జగదీష్‌యాదవ్ పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మంత్రి తలసానిని సత్కరించిన సంతోష్‌గుప్తా

అబిడ్స్: దళితుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గౌలిగూడలో ఈనెల 26న ప్రారంభించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మంత్రి తలసానిని ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దళితబంధు లాంటి పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దళితులకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు, మిత్రసేవక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే


చిన్నారులతో డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపాల్ శశికళ

గోల్కొండ: టోలిచౌకి సూర్యనగర్ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే జరిగింది. ఈ సందర్భంగా కిండర్ గార్టెన్, టీపీ విద్యార్థులు సందడి చేశారు. రవీంద్రభారతి పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రిన్సిపాల్ శశికళతో కలిసి చిన్నారులకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..చిన్నారుల జీవితంలో ప్రీప్రైమరి ఒక కీలక ఘట్టమన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి


కేఎస్.ఆనందరావుకు పురస్కారాన్ని అందజేస్తున్న దైవాజ్ఞశర్మ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాలచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉజ్వల సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి ఉగాది నంది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురస్కారాలు బాధ్యతను పెంచడంతో పాటు ఎదుటివారికి స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సామాజిక వేత్త వై.యాదగిరి, కోట సుశీల సత్యనారాయణ సేవా ట్రస్ట్ చైర్మన్ కేఎస్.ఆనందరావు, సంస్థ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

‘నెల రోజులు గడువున్నా.. 24 గంటల్లో అనర్హత వేటేంటి’


మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ

చార్మినార్: కోర్టు నెల రోజుల గడువు ఇచ్చినప్పటికీ.. 24 గంటల్లో అనర్హత వేటు వేయడం ఎంత వరకు సమంజసమని హైకోర్టు న్యాయవాది, ఏఐఎంఐఎం (ఇంక్విలాబ్) పార్టీ అధికార ప్రతినిధి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ ప్రశ్నించారు. శనివారం మొఘల్‌పురాలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశ ప్రధాని నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. మాట్లాడితే అనర్హత వేటంటూ గొంతు నొక్కుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు.

ఘనంగా నటరాజ రామకృష్ణ శత జయంతి వేడుకలు


కళాకారుల నృత్య ప్రదర్శన

నాంపల్లి: సుప్రసిద్ధ నాట్యాచార్యులు, ఆంధ్రనాట్యం, పేరిణి శివ తాండవం పునఃసృష్టికర్త, స్వర్గీయ పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను శనివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో స్వరసర్తన అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభినవ సత్యభామగా ప్రసిద్ధి చెందిన కళాకృష్ణ నృత్య దర్శకత్వంలో యువ ఆంధ్రనాట్య నృత్య కారుల బృందం ప్రదర్శించిన నృత్య రూపకం ప్రేక్షకులను అలరింపజేసింది. అలాగే పద్మా మోహన్ దెందులూరి శిష్య బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శనల పరంపర ప్రేక్షకులను కనువిందు చేసింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరై నృత్య కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆంధ్రనాట్య నృత్య పోటీల్లో విజేతలుగా నిలిచిన కళాకారులకు బహుమతులను అందజేశారు.

పట్టుదల ఉంటే అద్భుతాలు సృష్టించవచ్చు


మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్

చాంద్రాయణగుట్ట: పట్టుదల, సమయపాలన, ప్రణాళికతో కృషి చేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ అన్నారు. బండ్లగూడలోని అరోరా లీగల్ సైన్సెస్ అకాడమీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సహాయ, సలహా కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం అకాడమీ ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రేరణ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ మాజీ సలహాదారులు పద్మశ్రీ హనుమంత చౌదరీ, హైదరాబాద్ జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్, సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి శివరాం ప్రసాద్, ఉస్మానియా యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగం బోర్డు చైర్ పర్సన్ అపర్ణ తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో మహిళలపై అఘాయిత్యాలు, వారిని బాధించే ఘటనలు తనను కలచి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అందరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లా కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు జడ్జిలు బహుమతులు ప్రదానం చేశారు.

పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ 5వ వార్షికోత్సవ వేడుకలను శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలకు శ్రీ ధాత్రి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. తన జీవితం సినిమాకే అంకితమని తెలిపారు. తన 45 ఏళ్ల సినీ కాలంలో 10 భాషల్లో 700 సినిమాల్లో నటించే అదృష్టం తనకు దక్కిందన్నారు. అంతకు ముందు చిన్నారుల కూచిపూడి నృత్యాలు, సంగీత విభావరి ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అనంతలక్ష్మి, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సంధ్యారాణి, కార్యదర్శి రఘుశ్రీ పాల్గొన్నారు.


పురస్కార గ్రహీతలతో కేవీ రమణాచారి తదితరులు

బేగంబజార్‌లో ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్‌లో డీసీపీ కిరణ్ ఖారె, ఏసీపీలు సతీష్‌కుమార్, శివమారుతి

అబిడ్స్: పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈనెల 30న శ్రీరామనవమి శోభాయాత్రను పురస్కరించుకుని మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్, బేగంబజార్ పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లో దాదాపు 200 మంది పోలీసు సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ చేశారు. సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖారె, ఏసీపీలు సతీష్‌కుమార్, శివమారుతితో పాటు ఇన్‌స్పెక్టర్లు అజయ్‌కుమార్, రవి, రవీందర్‌రెడ్డి, శంకర్, దాదాపు 200 మంది పోలీసు సిబ్బంది ప్రజల్లో మరింత ధైర్య సాహసాలు కలిగే విధంగా ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా డీసీపీ కిరణ్ ఖారె మాట్లాడుతూ.. శ్రీరామనవమి శోభాయాత్రకు భారీ ఎత్తున బందోబస్తు చేపడుతున్నట్లు తెలిపారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి


పురానాపూల్ వద్ద బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఉమామహేంద్ర

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడుతోందని.. ఇది ఇక ఎంతో కాలం చెల్లదని చార్మినార్ నియోజకవర్గం బీజేపీ కాన్‌టెస్టెడ్ క్యాండిడేట్ ఉమామహేంద్ర అన్నారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ మహాధర్నా కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాతబస్తీ పురానాపూల్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. చార్మినార్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ బైక్ ర్యాలీకి ఉమామహేంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వేయక వేయక టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 వేయడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు పరీక్షలు రాస్తే..వాటిని కూడా లీక్ చేయించిన ఈ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. తమ నిజాయితీని నిరూపించుకోవడానికి సిట్‌కు బదులు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏ శాస్త్రీయ నృత్యానికైనా సాహిత్యమే ఆధారం


మాట్లాడుతున్న దండిభట్ల వైకుంఠ నారాయణమూర్తి

సుల్తాన్‌బజార్: ఏ శాస్త్రీయ నృత్యానికైనా సాహిత్యమే ఆధారమని, నృత్య కళాకారులు అందరూ నృత్య సాహిత్యంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ నృత్యరూప కవి దండిభట్ల వైకుంఠ నారాయణమూర్తి (కూచిపూడి) అన్నారు. శనివారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలంగాణ భాషా నిలయంలో నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. భారతీయ శాస్త్రీయ, సంగీత నృత్యకారుల పరిశోధాత్మక ప్రసంగ పరంపరలో భాగంగా నారాయణమూర్తి నృత్య సాహిత్యంపై ప్రసంగించారు. సంగీతం, సాహిత్యం మధ్య సమన్వయం చేసేది నృత్యమని ఆయన అన్నారు. కూచిపూడి నృత్యం–సాహిత్యం–సంగీతం–విలువలపై సహోధారణ ప్రసంగం చేశారు. ఈ సభకు ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర, నృత్య గురువు, చలపతి శాస్త్రి, డాక్టర్ నందూరి విద్యారణ్యస్వామి అతిథులుగా హాజరై వైకుంఠ నారాయణమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, డాక్టర్ ఇందిరా హేమ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత


మాతా జాగరణలో పాల్గొన్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కొంతసేపు అయినా ఆధ్యాత్మికతవైపు సమయం కేటాయిస్తే ఆనందంగా, తృప్తిగా ఉంటారన్నారు. లోధ్‌క్షత్రియ యువ సంఘటన్ ఆధ్వర్యంలో అప్పర్ ధూల్‌పేట్‌లో నిర్వహించిన మాతా జాగరణ్‌లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు ఆదరణ లభిస్తుందన్నారు. తెలంగాణ సంస్కృతితో పాటు భారతీయ సంస్కృతులను చాటే విధంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పరమేశ్వరీ సింగ్, ముఖేష్ సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆలపురుషోత్తమ్‌రావు, శాంతిదేవి, పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ, బల్‌దీప్ సింగ్, శశిరాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థులు, శిక్షకురాలు రాధిక తదితరులు

అబిడ్స్: వెల్ఫేర్ అసోసియేషన్ గుడిమల్కాపూర్ ఆధ్వర్యంలో రామాయణ నృత్య ప్రదర్శన నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ సాయిబాబ ఆలయంలో రామాయణంపట్ల ప్రజల్లో అవగాహన కలిగించే విధంగా శనివారం రాత్రి ఈ నృత్య ప్రదర్శనలు చేశారు. కురుగంటి కళాక్షేత్రం గురువు రాధిక శిష్యబృందం ఈ నృత్యప్రదర్శన చూడముచ్చటగా నిర్వహించారు. నృత్యప్రదర్శన చేసిన విద్యార్థులకు అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి

జియాగూడ: యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడ 2బీహెచ్‌కే డబుల్‌బెడ్‌రూమ్‌లలో నూతనంగా ఏర్పాటైన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... యువత ప్రభుత్వం ద్వారా అందించే రుణాలను పొందుతూ వివిధ కుటీర పరిశ్రమలు, వ్యాపారాలను చేపట్టాలని సూచించారు. రాజేందర్ కుమార్ డెగాన్, వెంకటేష్ యాదవ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాజేష్ కార్ట్‌మల్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్